కష్టంలో.. అండాదండా

దక్షిణ నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు.. సంక్షేమమే ధ్యేయంగా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా.. నియోజకవర్గంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తానున్నానంటూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో గల పలు వార్డుల్లో నెల కొన్న సమస్యలు పరిష్కరిస్తూ.. పరిష్కారం కాని వాటిని ఉన్నతాధికారులు.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ.. తనకంటూ ఓ ముద్ర వేసుకున్నారు.

- ప్రజలు, కార్యకర్తల కుటుంబాలకు భరోసాగా నిలుస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతుల మేరకు ఆర్థిక సాయం


మృతుడు శ్రీనివాసరావు పెద్దకర్మకు ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : వారంలో మంగళవారం.. శుక్రవారం ప్రజాదర్బార్, సోమవారం డయల్ యువర్ ఎమ్మెల్యే, శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తల కోసం గ్రీవెన్స్ ఇలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సమస్యల పరిష్కారానికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. గ్రీవెన్స్, ప్రజాదర్బార్, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాల్లో వచ్చిన ఫిర్యాదులు.. వినతుల ఆధారంగా బుధ, గురువారాల్లో నేరుగా ఫిర్యాదీదారుల ఇళ్లకు వెళ్లడం..ఆర్థిక సాయం అందజేస్తూ నియోజకవర్గ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. తాజాగా 37వ వార్డు పెయిన్‌దొరపేట బీచ్‌రోడ్డు గాంధీబొమ్మ ప్రాంతంలో నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త చింతపల్లి జోగారావు గత కొన్నేళ్లుగా బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నారని ప్రజాదర్బార్‌లో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా జోగారావు ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించారు. తన సొంత నిధుల నుంచి రూ.5 వేలు వైద్యం కోసం అందజేశారు. అదే ప్రాంతానికి చెందిన పార్టీ కార్యకర్త కదిరి శ్రీనివాసరావు కిడ్నీ సమస్యతో బాధపడుతూ చనిపోయినట్టు వార్డు నాయకుల ద్వారా తెలుసుకుని, శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి పెద్ద కర్మ కోసం తన సొంత నిధుల నుంచి రూ.5 వేలు అందజేశారు. సచివాలయ కన్వీనర్ భాను మాతృమూర్తి బుంగ ముత్యాలమ్మ స్పైనల్ కార్డు సమస్యతో బాధపడతున్నారని, స్కానింగ్ కోసం ఆర్థిక సాయం చేయాలని ప్రజాదర్బార్‌లో తెలపగా, పరామర్శించి రూ.2,500 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు మీసాల అశోక్‌కుమార్, కాసారపు వాసు, వెంకటలక్ష్మి, రామరాజు, పీసీ అప్పారావు, శ్రావణ్, భాను, జగన్, రోజా, సత్తిరాజు, ఆదివిష్ణు, వద్దాది దిలీప్‌కుమార్, సాగర్, ఆరుగుల రాజు, వార్డు నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.


జోగారావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాల పంపిణీ అనంతరం విద్యార్థులతో వాసవీ క్లబ్ ప్రతినిధులు

అల్లిపురం : వాసవీ క్లబ్ (అల్లిపురం) ఆధ్వర్యంలో విద్యా సేవ, ప్రకృతి సేవ కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. దీంట్లో భాగంగా బంగారమ్మమెట్ట, సీబీఎం యూపీ స్కూల్ విద్యార్థులకు క్లబ్ సభ్యులు, వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ పాలకుర్తి శ్రీనివాస అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ప్రకృతి సేవ కార్యక్రమంలో భాగంగా స్కూల్ ఆవరణలో పూల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుంటూ మొక్కలు నాటే అలవాటును అలవరచుకోవాలన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించినవారవుతారన్నారు. కార్యక్రమంలో రీజనల్ చైర్‌పర్సన్ వరిగల పండు, క్లబ్ ప్రెసిడెంట్ డీవీఎస్ఎన్ రాజు, కార్యదర్శి బీవీఎల్ కుమార్, మాజీ అధ్యక్షుడు ఎస్.విఠల్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం, బోర్డు సభ్యులు దాసు ఆదినారాయణమూర్తి (అనిల్), వంకాయల రవి, విక్రమ్, స్కూల్ ప్రిన్సిపాల్ జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'కోలా'కు అభినందన


వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో కోలా గురువులును సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కె.కె.రాజు

డాబాగార్డెన్స్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికీ గౌరవం.. గుర్తింపు ఉంటాయని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులు బుధవారం బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే గురువులును సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ముందుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి 16 ఫిషింగ్ హార్బర్లు, 4 పోర్టుల నిర్మాణం, 11 ఫిషింగ్ స్టేషన్లు, చేపల వేట నిషేధ సమయంలో రూ.4 వేల భృతిని రూ.10 వేలకు పెంచిన ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన


మెడికల్ క్యాంపులో పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

అల్లిపురం : బంగారుమెట్ట, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆవరణలో బుధవారం ఓమ్నీ ఆర్కే, వుమెన్ అండ్ చైల్డ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. ఉదయం 6 గంటల నుంచి షుగర్, బీపీ తదితర పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మరిన్ని పరీక్షలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బందితో పాటు క్లబ్ సభ్యుడు భీశెట్టి రాజు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో పూజా రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి. లేదా endow- eokanaka@gov. in ద్వారా పంపవచ్చు.

పాఠశాల ఆవరణలో కూలిన చెట్టు తొలగింపు


సీబీఎం యూపీ స్కూల్ ఆవరణలో కూలిన చెట్టును తొలగిస్తున్న హార్టీకల్చర్ సిబ్బంది

అల్లిపురం : ఇటీవల కురిసిన వర్షానికి నీలమ్మ వేపచెట్టు దరి సీబీఎం అప్పర్ ప్రైమరీ స్కూల్ ఆవరణలో ఒక చెట్టు పడిపోయింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విషయం వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొర్రా శ్రీనివాసరెడ్డికి తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దృష్టికి ఆయన ఈ విషయం తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జీవీఎంసీ హార్టీ కల్చర్ విభాగం సిబ్బంది బుధవారం చెట్టును తొలగించారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జాస్మిన్, ఉపాధ్యాయులు పి.ఉమామహేశ్వరరావు, ఈ.శ్రీనివాస్, కేపీ రాజు, పి.ఉమామహేశ్వర్లు, విద్యార్థులు ఎమ్మెల్యేకు, శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చురుగ్గా ఓటర్ జాబితా పరిశీలన


ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అధికారులు

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డులో బుధవారం గౌరీవీధి సచివాలయం పరిధి, వెంకటేశ్వరమెట్ట, ముదుగుల్ల ప్రాంతాల్లో ఓటర్ జాబితా వెరిఫికేషన్ చురుగ్గా కొనసాగింది. బీఎల్‌వో, సచివాలయ సెక్రటరీ జాన్‌బాబుతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు జేసీజే ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ సమక్షంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పేర్లు పరిశీలించారు. ఆధార్ నంబర్లు, చనిపోయిన, అద్దె ఇంటి నుంచి మారిపోయిన వారి వివరాలు సేకరించారు.

కార్పొరేటర్ పూర్ణిమ ఔదార్యం


చిన్నారావు కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం : జ్ఞానాపురం మాన్యువల్ స్ట్రీట్‌లో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొలగాని చిన్నారావు మంగళవారం రాత్రి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ మంగళవారం అంత్యక్రియల నిమిత్తం రూ. 5 వేలు చిన్నారావు కుటుంబ సభ్యులకు అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా త్వరితగతిన అందేటట్లు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి మోహన్, కమల్‌కుమార్, పిల్లి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీమద్భాగవత సప్తాహం ప్రారంభం


భాగవత పఠనం చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్ : పాతనగరం రాజప్పనాయుడు వీధిలో గల గీతా ప్రచార సమితి కార్యాలయం (గీతా భవనం)లో వేడుకగా శ్రీమద్భాగవత సప్తాహం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మందిరంలో వేంచేసిన గోసహిత శ్రీకృష్ణ పరమాత్మునికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులు సామూహికంగా భాగవత పఠనం చేశారు. ముందుగా సంస్థ గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఉపాధ్యక్షుడు పి. జగన్మోహనరావు, కార్యదర్శి వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెంచ్ భాషా వారోత్సవాలు


విద్యార్థినులతో ముఖ్య అతిథి మేరీ ఏంజిల్ బసేస్

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఫ్రెంచ్ జాతీయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. ఫ్రెంచ్ భాష ఆచార్య సిస్టర్ జైన్ నేతృత్వంలో ఫ్రెంచ్ గీతాలాపన, అభినయం, నృత్యాలు, సంస్కృతి పట్ల అవగాహన, క్విజ్ పోటీలు నిర్వహించారు. తమ కళాశాల ప్రారంభం నుంచి ఫ్రెంచ్‌ను ద్వితీయ భాషగా నేర్పిస్తున్నట్లు విభాగాధిపతి డాక్టర్ పీకే జయలక్ష్మి తెలిపారు. ముఖ్య అతిథిగా మేరీ ఏంజిల్ బసేస్ హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో ఫ్రెంచ్ భాష గొప్పదనాన్ని వివరించారు. విదేశీ భాషలు నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసంతో పాటు మేధో వికాసం పెరుగుతుందన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముక్త, చైత్ర, దీపిక, హర్షిత సాన, దీవెన, సాయిగీత, ఆధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


నిరసన తెలుపుతున్న ఆలిండియా దళిత రైట్స్ ఫోరం ప్రతినిధులు

సీతమ్మధార : మణిపూర్ హింసా కాండను నిరసిస్తూ విశాఖపట్నం ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు నేరుగా కలుగజేసుకొని దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంతా ఏకతాటి పైకి వచ్చి ఇటువంటి చర్యలను ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు పట్టా రమేష్, మచ్చ కోటేశ్వరరావు, జి.జగ్జీవన్‌రావు, వి.గోవిందరాజు, పి.లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులకు ఉచితంగా న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి శేషమ్మ

విశాఖ లీగల్ : కక్షిదారులకు న్యాయసహాయం ఉచితంగా అందించడమే న్యాయ సేవా సంస్థ లక్ష్యమని విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎన్.వి.శేషమ్మ అన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సంస్థ ప్రాంగణంలో ఆన్‌లైన్ యాప్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించే న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాధితులకు ఆన్‌లైన్ యాప్‌లో సంప్రదిస్తే వారికి తగిన విధంగా సహాయం అందించాలని కోరారు. ప్రతి న్యాయవాది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమకు అందుబాటులో ఉన్న ఫిర్యాదులను స్వీకరించి న్యాయ సహాయం అందించాలని కోరారు. కక్షిదారులు యాప్ ద్వారా ఫిర్యాదులు పంపిస్తే తక్షణం స్పందిస్తామన్నారు. లోక్ అదాలత్ జాతీయ శిక్షకులు రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ కక్షిదారులు ఉచిత న్యాయసహాయం కోసం ఆన్‌లైన్‌సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు


పరీక్ష కేంద్రం పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను వర్సిటీ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు బుధవారం పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న బీఈడీ పరీక్షలను స్వయంగా తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడంపై అధికారులను అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆర్ట్స్ కళాశాలలోని విభాగాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి, తరగతులు జరుగుతున్న విధానం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్-3, 5, 8 పరిధి పలు ప్రాంతాల్లో గురువారం తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని పర్యవేక్షక ఇంజినీరు కె. వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రైవాడ మంచినీటి సరఫరా పథకం ద్వారా దేవరాపల్లి నుంచి నరవకు నీటి సరఫరా చేసే ఓపెన్ కెనాల్ గవరపాలెం వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గండిపడిన దృష్ట్యా, మరమ్మతుల కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు. అలాగే జోన్-3 పరిధి 14 నుంచి 24వార్డులు, 26వ వార్డులో డాక్టర్స్ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, అంబేడ్కర్ నగర్, ఇందిరాగాంధీ బొమ్మ లైన్, చైతన్యనగర్, కనకమ్మ టెంపుల్, కెప్టెన్ ఏరియా, గాంధీనగర్, శారదా స్కూల్, ఓల్డ్ కోపరేటివ్ బ్యాంకు, క్రాంతినగర్, ఎన్‌హెచ్-16 రోడ్డు ఏరియా, లలితానగర్, రామకృష్ణానగర్, 80 అడుగుల రోడ్డు, ఎన్జీవోస్ కాలనీ, చిన్నూరు, మంగళవీధి తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. జోన్-5 పరిధి 44, 46, 47, 50, 51, 54, 57 వార్డుల పరిధిలో మత్రిపాలెం, జ్యోతినగర్, మహరాణివీధి, బాపూజీనగర్, మాధవధార వుడా లే అవుట్, మాధవధార, కళింగనగర్, ఎన్జీవోస్ కాలనీ, పట్టాభిరెడ్డి తోట, సూర్యానగర్, సిద్ధార్థనగర్, తుమ్మడిపాలెం, సుభాష్‌నగర్, భవానీ గార్డెన్స్, కస్తూరినగర్-1, శాంతినగర్-1,2, సంజీవయ్యనగర్ హిల్ ఏరియా, బాపూజీనగర్-1, 2, అంబేడ్కర్ ఎస్టేట్, సురేష్‌రామ్‌నగర్, పెద్ద కొత్తూరు హిల్‌ఏరియా దిగువ భాగం, రాంజీ ఎస్టేట్, తిక్కవానిపాలెం కాలనీ, జైప్రకాష్‌నగర్, కప్పరాడ-1, 2, ఇందిరానగర్-4, 5, మహాత్మాగాంధీనగర్, జవహర్‌లాల్ నగర్, ఏఎస్ఆర్ నగర్, శ్రీనివాసనగర్, పోలీస్ క్వార్టర్స్, పలనాటి కాలనీ, గోకుల్‌నగర్, గొల్ల కంచరపాలెం, దుర్గానగర్, అబిద్‌నగర్, పోస్ట్ ఆఫీస్, గోలీలపాలెం, శ్రీనివాసనగర్, నందగిరినగర్, చెక్కు దురాయి బిల్డింగ్ ఏరియా, దాడి రామ్మూర్తి కల్యాణ మండపం తదితర ప్రాంతాలు, జోన్-8 పరిధి 92వ వారుడలో గల శ్రీరామ్‌నగర్, శ్రీనుబాబునగర్, అజంతాపార్క్, టైలర్స్‌కాలనీ, వుడా కాలనీ, పవర్ ఆఫీస్ ఎదురుగా, ఆర్‌ఆర్ పురం, రజక కాలనీ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలన్నారు.

చట్ట ప్రకారం బోనస్ చెల్లించాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆసుపత్రుల సిబ్బంది

సీతమ్మధార : చట్ట ప్రకారం సకాలంలో బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ విశాఖ జిల్లా హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ),సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సెవెన్ హిల్స్ హాస్పిటల్ యూనియన్ కార్యదర్శి నూకరాజు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలు యాజమాన్యం పరిష్కరించడం లేదని, కార్మికులను తొలిగించే పనిలో ఉందన్నారు. అధ్యక్షుడు నాయుడు మాట్లాడుతూ సూపర్‌వైజర్ల అరాచకాలు ఎక్కువగా ఉన్నాయని, చదువుకుని కూడా అసభ్యకరంగా మాట్లాడుతున్నారని అన్నారు. 15 శాతం ఇంక్రిమెంట్లు ఎరియర్స్‌తో సహా చెల్లించాలని, యూనిఫాంతో పాటు షూస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, వై.రాజు, బాల తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజల ఆత్మీయ సమ్మేళనం రేపు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు

సీతంపేట: శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు తెలిపారు. సీతంపేటలోని తన ఇంటి వద్ద బుధవారం ఉదయం ఈ మేరకు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ నగరంలో సుమారు నాలుగున్నర లక్షల మంది శెట్టి బలిజలు ఉన్నారని, వారందర్నీ ఒకే తాటిపైకి తీసుకువచ్చేలా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. శెట్టిబలిజ సంఘం నాయకుడు కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ వైద్యాధికారులు కడలి సత్యవరప్రసాద్, కముజు నరసింహారెడ్డి, యాంద్ర రాంప్రసాద్, యాంద్ర లక్ష్మీనరసింగరావు, చెల్లుబోయిన మంగ వెంకట్‌లను సత్కరిస్తామన్నారు. సంఘం నాయకులు కడలి సుబ్బారావు, కేతా గంగరాజు, కడలి శివ కేశవ నరసింహారావు, వాసర్ల బాలకృష్ణ, గుత్తుల వెంకటేశ్వరరావు, నరాల బాలకృష్ణ, గుత్తుల సుబ్రహ్మణ్యం, గుత్తుల రాజశేఖర్, కట్టా శ్రీకాంత్, మామిడిశెట్టి రామకృష్ణమూర్తి, రాయుడు శివరామకృష్ణ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానమే అమలు చేయాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

సీతమ్మధార: ఫిబ్రవరి 1999 నుంచి 2004 జూలై 31 మధ్య నియమించబడిన విద్యుత్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానమే వర్తింపజేయాలని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధి కె.తేజభాస్కరరావు డిమాండ్ చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి, ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ పొరుగు సేవల సిబ్బందిని విద్యుత్ సంస్థలో విలీనం చేసి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. పెరిగిన పని భారానికి అనుగుణంగా వెంటనే అదనపు పోస్టులు మంజూరు చేయాలన్నారు. జూనియర్ ఇంజినీర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పీ అండ్ జీ ట్రస్టులను బలోపేతం చేయాలని, యూనియన్లు, అసోషియేషన్లకు సభ్యత్వం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పి.చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ పి.ప్రతాప్‌రెడ్డి, కన్వీనర్ బి.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీతమ్మధార : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని విశాఖ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆర్టీసీ కంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నాలో ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఇంజినీరింగ్, నీటి సరఫరా, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ విభాగాల్లో జీతాలు, యూజీడీ కార్మికులకు హెల్త్ అలవెన్సు, ఇతర కేటగిరీలకు రిస్క్ అలవెన్సు, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 7న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. 17న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.అప్పారావు, ఎంవీ ప్రసాద్, జె.నాయుడు, రత్నం, ఎం.ఈశ్వరరావు, ఆదినారాయణ, శంకర్‌రెడ్డి, రాజశేఖర్, మీనాక్షి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, సత్యవతి, గణేష్, కార్మికులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో పింగళి జయంతి


పింగళి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్ : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 147వ జయంతి బుధవారం రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయ సీనియర్ పాఠకురాలు ఎం. చిట్టినాయుడమ్మ, టి. కుసుమకుమారి, పలువురు పాఠకులు పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పోలితల్లి మాట్లాడుతూ పింగళి వెంకయ్య 1876లో కృష్ణాజిల్లా బట్ల పెనుమర్రులో జన్మించారని, ప్రాథమిక విద్య పెద్ద కల్లేపల్లిలోనూ, హైస్కూల్ విద్య బందర్‌లో పూర్తి చేశారని, తన 19 ఏట దక్షిణాఫ్రికా వెళ్లారని, సాహసం, చొరవతో బోయర్ ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. 1921లో అఖిల భారత ఉద్యమం విజయవాడలో జరిగినప్పుడు మహాత్మాగాంధీ సలహా మేరకు జాతీయ జెండాను పింగళి రూపొందించారన్నారు. 1963 జూలై 4న పింగళి మృతి చెందారని గ్రంథాలయ పాఠకులకు వివరించారు. ఈ సందర్భంగా పిల్లలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు మైక్‌సెట్ బహూకరణ


మైక్‌సెట్ బహూకరిస్తున్న శకుంతల

డాబాగార్డెన్స్ : విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ మానవత్వం చాటుకోవాలని చైతన్య మహిళా జూనియర్ కళాశాల అధ్యక్షురాలు కె. శకుంతల పేర్కొన్నారు. ఆమె జన్మదినం సందర్భంగా బుధవారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అవసరమైన మైక్‌సెట్‌ను బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రమాదేవి, బోధన సిబ్బంది, విద్యార్థినులు, మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు మార్టిన్ పెరీర, బిజ్జు, ఎం. పోతురాజు తదితరులు పాల్గొన్నారు.